## క్లుప్తంగా

### దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేసిన కలెక్టర్



వీల్ చైర్ అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

**కైలాస్‌నగర్:** నార్నూర్ మండలం జామడ గ్రామానికి చెందిన ఆత్రం మారుతీ అనే దివ్యాంగుడికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం ట్రై సైకిల్ అందజేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద ఐసీడీఎస్ అధికారులతో కలిసి కలెక్టర్ దివ్యాంగుడికి అందించారు.

### ప్రజలకు అందుబాటులో ఉండాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీవో సుధీర్‌రెడ్డి

**తలమడుగు:** మండలంలో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీవో సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీలో చేపడుతున్న పరిశుద్ధ్య పనులు పరిశీలించారు. సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రోడ్లపై చెత్తాచెదారం, మురికి నీరు నిల్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కనీస వేతనం అందించాలి

**ఎదులాపురం:** ప్రభుత్వ ఆసుపత్రిలో ఐహెచ్ఎఫ్ఎంఎస్ విభాగంలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీలుగా పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు రమేశ్, భూపాల్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టి.. రాష్ట్ర కమిషనర్‌కు వినతిపత్రం అందించినట్లు జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలిపారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు పెరిక దేవిదాస్, పండగ పొచ్చన్న, దశాంత్, రమేశ్, రమాకాంత్, ఖలీల్, హరీష్, చంపత్, సోమనాథ్, శేఖర్, దత్తు, దేవేందర్ పాల్గొన్నారు.

### బీజేపీకి వెన్నుదన్నుగా నిలవాలి

**నేరడిగొండ:** దేశాభివృద్ధికి పరుగులు పెట్టించే బీజేపీకి వెన్నుదన్నుగా నిలవాలని బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమ మండల ఇన్‌చార్జి, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి కోరారు. మండలంలోని 278వ పోలింగ్ బూత్ పరిధిలోని వెంకటాపూర్, కుంటాల(బి), నాగమల్యాల్, పీచర గ్రామాల్లో బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. ప్రధాని మోదీ విదేశాల్లో మన దేశ కీర్తి ప్రతిష్టలను పెంచుతున్నారని తెలిపారు. ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకొని మోదీకి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, జాదవ్ పరుశురాం, గట్టు నారాయణ, చెట్‌పల్లి వెంకటేశ్, ఆడే వంశీ నాయక్, తొప్పారాం విజయ్ పాల్గొన్నారు.

### పెట్రోల్ పంప్ ప్రారంభం

**ఆదిలాబాద్‌రూరల్:** మండలంలోని యాపల్‌గూడ శివారు ప్రాంతంలో గల యాపల్‌గూడలోని 2వ పోలీస్ బెటాలియన్, తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (ఇండియన్ రిజర్వ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్‌ను అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సంజయ్ కుమార్ జైన్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. అధికారులతో సమావేశమైన ఆయన బెటాలియన్‌లో ఉన్న సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, అసిస్టెంట్ కమాండెంట్ దేవిదాస్ రాథోడ్, ఏజేపీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

### గోలి శంకర్ మృతి తీరని లోటు

**ఆదిలాబాద్‌టౌన్:** బీఆర్ఎస్ నాయకుడు గోలి శంకర్ మృతి తీరని లోటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ బలోపేతానికి కృషి చేశారని పేర్కొన్నారు. మానవత్వంతో పలువురికి సేవ కార్యక్రమాలు చేసేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, యూనుస్ అక్బాని, విజ్జగిరి నారాయణ, రంగినేని శ్రీనివాస్, సాజిదొద్దీన్, స్వరూపరాణి, ఆసిఫ్ ఖాన్, యాసం నర్సింగ్ రావు, అజయ్ పాల్గొన్నారు

# సర్వేకు బ్రేక్..!



మార్కింగ్ చేస్తున్న సర్వే అధికారులు (ఫైల్)

- నిలిచిన చెరువుల ఆక్రమణల గుర్తింపు సర్వే
- ప్రజాగ్రహంతో వెనక్కి తగ్గిన యంత్రాంగం
- బాధితులకు ప్రతిపక్షనాయకుల పరామర్శ

**కైలాస్‌నగర్:** జిల్లాలోని చెరువుల ఆక్రమణల గుర్తింపు సర్వేకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువులోని ఆక్రమణలను గుర్తింపుకు సంబంధించిన సర్వేకు బ్రేక్ పడింది. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్‌శాఖల అధికారులు నాలుగు ప్రత్యేక బృందాలుగా విడిపోయి చెరువులో సర్వే చేపట్టారు. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నటువంటి ఆక్రమణలను గుర్తించి వాటికి మార్కింగ్ చేశారు. తొలిరోజు మాత్రమే సర్వే సాఫీగా సాగింది. రెండో రోజు సర్వేకు వెళ్లిన ఆయా శాఖల అధికారులను కాలనీవాసులు అడ్డుకున్నారు. వారితో వాగ్వాదానికి దిగి సర్వేకు అడ్డుపడటంతో పాటు వారి వద్ద ఉన్న దస్త్రాలను లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడి నుంచి అధికారులు వెనుదిరిగారు. గత మూడు రోజులుగా సర్వే పూర్తిగా నిలిచిపోయింది.

**జిల్లా కేంద్రం నుంచే ప్రారంభం..**

చెరువులను సంరక్షించాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం వాటిల్లోని ఆక్రమణల గుర్తింపునకు ఆదేశించింది. అందుకు సంబంధించి రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా సర్వేను చేపట్టాలని సూచించింది. దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం తొలుత ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచే సర్వేను ప్రారంభించింది. రోజురోజుకు పెరుగుతున్న ఆక్రమణలతో ఆనవాళ్లను కోల్పోయే పరిస్థితిలో ఉన్నటువంటి ఖానాపూర్ చెరువులోని ఆక్రమణలను గుర్తించేలా చర్యలకు ఉపక్రమించారు. గత నెల 26న సర్వేను ప్రారంభించారు. తొలి రోజున సర్వే ప్రశాంతంగా సాగగా సుమారు 120 వరకు ఆక్రమణలను గుర్తించారు. ఎఫ్‌టీఎల్‌లోనే నిర్మాణాలు ఉన్నట్లుగా గుర్తించి వాటికి మార్కింగ్ చేశారు. రెండో రోజు సర్వేకు వెళ్లిన అధికారులను కాలనీవాసులు అడ్డుకోవడంతో సర్వే అర్థంతరంగా నిలిచిపోయింది.

**ప్రజల ఆందోళన ఫలితమే..**

ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లను ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లుగా అధికారులు మార్కింగ్ చేయడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. హైదరాబాద్ తరహాలో తమ ఇళ్లను కూల్చివేస్తారేమోననే భయానికి గురైన కాలనీవాసులు సర్వేను అడ్డుకున్నారు. దీంతో చేసేదేమి లేక సర్వే అధికారులు వెనక్కి వెళ్లిపోయారు. తిరిగి సర్వేను ప్రారంభిస్తారా? లేదా? అనేది స్పష్టత లేదు.

### అధికారుల్లో స్పష్టత కరువు

చెరువుల సర్వేపై రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారుల్లో స్పష్టత కరువైంది. ఆయా శాఖల కీలక అధికారి ఆర్డీవో వినోద్ కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తు ఫోన్‌ను కట్ చేశారు. ఇరిగేషన్ డీఈ రాథోడ్ విఠల్, మున్సిపల్ కమీషనర్ ఖమర్ అహ్మద్‌ను ఫోన్‌లో సంప్రదించగా సర్వే గురించి తనకేమి తెలియదని, ఆర్డీవోను అడగాలని దాటవేత వైఖరిని ప్రదర్శించడం గమనార్హం. సదరు ముగ్గురు అధికారులు భిన్నమైన సమాధానాలు చెప్పడం చెరువుల సంరక్షణ ప్రకటనలకే పరిమితం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

**నేరడిగొండ:** మండలంలోని లఖంపూర్ ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థినులు చదరంగం, కరాటే పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రావు తెలిపారు. చుక్క ధర్మరాజు స్మారక కరాటే ఛాంపియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటారు. కటా విభాగంలో పి.చైతన్య, ఎ.సౌజన్య, కె.కీర్తన, బి.రక్షిత, అంకితలు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. అలాగే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పాఠశాల విద్యార్థిని ఎస్.లక్ష్మి మూడో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అక్టోబర్ 29న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను ఏటీడీవో అమిత్, పీడీ రాధ, కరాటే మాస్టర్ సురేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

**చెస్ పోటీలకు..**

**ఇచ్చోడ:** గురుకుల పాఠశాల విద్యార్థి ఆడే చైతన్య రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. నేరడిగొండ మండలంలోని బుగ్గారం గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని చైతన్య అండర్- 15 బాలికల జిల్లాస్థాయి పోటీలో రెండో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. స్వప్న తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థికి ధ్రువపత్రం అందచేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తపస్విని, స్వరుప, పీఈటీ జాదవ్ లత, గంగామణి, సిబ్బంది రమ్య, పవిత్ర, సావిత్రి, లీతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన జిల్లా విద్యార్థులు

**యోగాసన పోటీల్లో ప్రతిభ**

**ఆదిలాబాద్:** రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 28, 29 తేదీల్లో జరిగిన ఐదో రాష్ట్రస్థాయి యోగాసన సీనియర్ అండ్ మాస్టర్స్ పోటీల్లో 4 పతకాలు కైవసం చేసుకున్నారు. ఆర్టిస్టిక్ పెయిర్ ఈవెంట్లో భార్గవ్, ప్రజ్యోత్ సంయుక్తంగా గోల్డ్ మెడల్ సాధించారు. అదే విధంగా ట్రెడిషనల్ విభాగంలో ప్రజ్యోత్ రజత పతకంతో మెరవగా, భార్గవ్ కాంస్య పతకంతో నిలిచాడని జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు అన్వేష్ బాబు తెలిపారు. పెటా జనరల్ సెక్రెటరీ స్వామి, రవీందర్ రెడ్డి, చేతన్, సంతోష్, రూప, తదితరులు అభినందనలు తెలిపారు.

**2న జోనల్ స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు**

**ఆదిలాబాద్:** ఎస్జీఎఫ్ జోనల్‌స్థాయి అండర్-14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్మల్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కాలేజీ మైదానంలో ఈనెల 2న నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటి 2011 తర్వాత జన్మించిన వారు 14 సంవత్సరాల విభాగంలో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు బోనాఫైడ్ ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకు పోటీల కన్వీనర్ వన్నెల భూమన్నకు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 99631 98021 సంప్రదించాలని కోరారు.

# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

**కైలాస్‌నగర్:** కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించడంతో పాటు, కమిషన్‌ను క్వింటాల్‌కు రూ.300కు పెంచాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాంపల్లి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతీ ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలన్నారు. పది లక్షల రూపాయల ఇన్సూరెన్స్‌ను అమలు చేయడంతో పాటు డీలర్లకు హెల్త్ కార్డులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ బాధ్యులు వెంకటేశ్, మధుకర్, ఆరీఫ్, వినోద్, తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

# ముందస్తు బతుకమ్మ సంబురాలు



ఆదిలాబాద్‌టౌన్: బతుకమ్మలతో ఉపాధ్యాయులు

**ఆదిలాబాద్‌టౌన్/తలమడుగు/నేరడిగొండ:** ఆదిలాబాద్ పట్టణంలోని గెజిటెడ్ నెం.1 ప్రభుత్వ పాఠశాలలో, తలమడుగు మండలంలోని రుయ్యాడి పాఠశాలలో, నేరడిగొండ మండలంలోని బుగ్గారం గ్రామంలో పాఠశాలలో విద్యార్థులు ముందస్తుగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందగా పేర్చి ఆడిపాడారు.



తలమడుగు: రుయ్యాడిలో..

### వ్యభిచార గృహంపై దాడి

- ఆరుగురిపై కేసు నమోదు

**ఆదిలాబాద్‌రూరల్:** మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ కాలనీలో వ్యభిచార గృహంపై సోమవారం దాడి చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అంకత్ రవీందర్ భార్య సరోజాలు రాంనగర్ కాలనీలో గది అద్దెకు తీసుకొని గత కొన్ని నెలల నుంచి వ్యభిచార గృహాన్ని కొనసాగిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు వీటులు మహేశ్, నవనీత్, చౌహాన్‌లతో పాటు వ్యభిచార గృహం నిర్వహిస్తున్న రవీందర్, సరోజా, మహిళలను సరఫరా చేస్తున్న సోయం పుష్పలతలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పదవీ విరమణ పదవీకే కానీ సేవ కాదు

**బజార్‌హత్నూర్:** పదవీ విరమణ వయస్సుకే కాని సేవకు కాదని మాజీ జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయుడు కొడిమల గంగయ్య పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో కిషన్‌గుప్తా, ప్రధానోపాధ్యాయులు భూమన్న, సదానందం, కౌసల్య, కొత్త శంకర్, చిలుక్కారి భూమన్న, లక్కం శంకర్, వొర్నె రమణ, బాపురావ్, నరేశ్, రాములు, శ్రీనివాస్, శివుడు, ప్రశాంత్ పాల్గొన్నారు.

### రేపు సర్వమత ప్రార్థనలు

**ఆదిలాబాద్‌టౌన్:** గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థన నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని స్కౌట్స్ మాస్టర్లు, గైడ్స్ క్యాప్టెన్లు, విద్యార్థులు పాల్గొనాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల ప్రగతి పాఠశాలలో ఉదయం 8 గంటలకు జెండా ఆవిష్కరణ కార్యక్రమంతో పాటు సర్వమత ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

### జన్యుమార్పిడి పంటలతో అనర్థాలు

**కైలాస్‌నగర్:** జన్యుమార్పిడి పంటలతో ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతుందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన జన్యుమార్పిడి పంటలు అనే అంశంపై దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘం నాయకులతో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. స్వయంశక్తి, ప్రకృతి పరిరక్షణతో కూడిన వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు.

### ఎంపీ మల్లు రవికి ఘన స్వాగతం



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కైలాస్‌నగర్:** మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులుగా నియామకమైన, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అక్కడికి వెళ్తుండగా.. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌ను సందర్శించారు. ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పూల బొకే అందించి సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. జమ్ముకాశ్మీర్, హర్యానా ఎన్నికల్లో హస్తం పార్టీ సత్తా చాటుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్‌టౌన్:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, పదిలో మంచి ఫలితాలు సాధించి ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని రణదీవెనగర్ ప్రాథమిక పాఠశాలలో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అలాగే అతిథి భోజన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.90వేల ఆర్థిక సాయంతో 300 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఆయా పాఠశాలల్లో మేజర్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అంతకుముందు విద్యార్థులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. కలెక్టర్ చిత్రపటాన్ని గీసి ఆయనకు బహూకరించారు. ఇందులో డీఈవో ప్రణీత, ప్రధానోపాధ్యాయుడు భూషన్‌రెడ్డి, నరేందర్, సత్యనారాయణ, లక్ష్మణ్, పరిమిళ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

# 'పేదల ఇళ్లు కూల్చివేస్తే సహించం'

**ఆదిలాబాద్‌టౌన్:** పేదల ఇళ్లు కూల్చివేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో పర్యటించారు. ఇటీవల అధికారుల బృందం సర్వే చేస్తుండడంతో భయాందోళనకు గురవుతున్న బాధితులతో మాట్లాడారు. ఖానాపూర్, కోలిపుర, తిర్పెల్లి, అంబేద్కర్‌నగర్ కాలనీవాసులకు ధైర్యం చెప్పారు. ఇళ్ల కూల్చివేసే ప్రయత్నం చేస్తే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఎవరు భయాందోళనకు గురికావొద్దని భరోసానిచ్చారు. బాధితులపై కేసులు నమోదు చేయడం సరైనది కాదన్నారు. దశాబ్ద కాలంగా పేదలు ఈ ప్రాంతంలో నివసిస్తున్నారని, గతంలో కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బులు సంపాదించడమే లక్ష్యంగా అడుగులు వేస్తుందని విమర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, సాజిదొద్దిన్, శ్రీనివాస్, స్వరూపరాణి, ఇజ్జగిరి నారాయణ, పవన్ నాయక్, ధమ్మపాల్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న జోగు రామన్న

# ముగిసిన పోషణ మాసోత్సవాలు

**ఆదిలాబాద్‌టౌన్:** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో వార్డు స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్త రాధ, తదితరులు పాల్గొన్నారు.

**జైజవాన్ నగర్‌లో..**

ఆదిలాబాద్ పట్టణంలోని జైజవాన్ నగర్‌లో కేంద్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ పిల్లలు, డ్వాక్రా మహిళలకు చిరుధాన్యాల ప్రాధాన్యత, వాటిని తినడంతో కలిగే ప్రయోజనాల గురించి గిడ్డంగుల మేనేజర్ రవికుమార్ వివరించారు. వాటితో తయారు చేసిన పాయసం, రాగిజావ, బిస్కెట్లను పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ గౌతమ్, సాయికృష్ణ, శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న స్పెషల్ ఆఫీసర్

# గ్రామాల్లో వైద్యశిబిరం

**ఇచ్చోడ:** మారుమూల గిరిజన గ్రామాలైన కుంటగూడ, పాలవాగు గ్రామాల్లో సోమవారం నర్సపూర్ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిచారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్ఎం రేణుక పాల్గొన్నారు.

**పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం**

**నేరడిగొండ:** వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని గాంధారి గ్రామంల్లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. కొబ్బరిబోండాలు, పాత టైర్లు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, అందులో వృద్ధి చెందే దోమలతో వ్యాధులు ప్రబలుతాయని వివరించారు. ఆశ కార్యకర్త ఆత్రం గంగామణి, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

### కాన్షీరాం వర్ధంతి విజయవంతం చేయండి

**ఎదులాపురం:** జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో ఈనెల 9న నిర్వహిస్తున్న మాన్యశ్రీ కాన్షీరాం 18వ వర్ధంతిని విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రమేశ్ రత్నపురం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈనెల 9న ఉదయం 10.30 గంటలకు స్థానిక బీసీ భవనంలో వర్ధంతి కార్యక్రమం ఉంటుందన్నారు. బహుజనులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, దుమ్మ శ్రీహరి, చిలుముల పంచాక్షరి, పాలెపు సురేశ్, అనిల్ పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య లేకుండా చూడాలి

**ఇంద్రవెల్లి:** గ్రామాల్లో నీటిసమస్య లేకుండా చూడాలని మల్టీపర్పస్ కార్మికులపై ఉందని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. నీటి సరఫరాపై మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిక్షణ తరగతులో సోమవారం మూడో రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. చిన్న చిన్న నీటి సమస్యలు రాకుండా మల్టీపర్పస్ కార్మికులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం నీటి నాణ్యత నిపుణులు తిరుపతి, అస్లాం ఆధ్వర్యంలో బోరు బావి, మిషన్ భగీరథ నీటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్, మల్టీపర్పస్ కార్మికులు పాల్గొన్నారు.

### జయప్రదం చేయండి

**ఎదులాపురం:** జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజుద్దీన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు షఫిక్ అహ్మద్ అథర్, సాజిద్, ఖాలిద్ అహ్మద్, ఇమ్రాన్‌ఖాన్, రిజ్వాన్ ఖాన్, అస్లాంఖాన్, షేక్ ఇస్మాయిల్, తబ్రేజ్ ఖాన్, హాఫిజ్ సమీర్ బేగ్, నవీన్ పాల్గొన్నారు.

### రిమ్స్‌లో అన్నదానం

**ఆదిలాబాద్‌టౌన్:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తన తండ్రి జోగు ఆశన్న జ్ఞాపకార్థం రిమ్స్ ఆస్పత్రి ఆవరణలోని అంబాడి బాబా సేవ కేంద్రంలో సోమవారం అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.